కొనసాగుతున్న సమగ్ర సర్వే



వాజేడు: సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ వీరభద్రప్రసాద్



ములుగు రూరల్: సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి అజ్మాత్

వాజేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే కొనసాగుతుంది. బుధవారం ఔమండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, డీటీ రాహుల్ చంద్ర వర్మ సర్వేను పరిశీలించారు.

ప్రతీ కుటుంబం భాగస్వామ్యం కావాలి

ములుగు రూరల్: మండలంలోని సర్వాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని జగ్గన్నగూడెం పక్కన ఉన్న 20 గుత్తికోయ కుటుంబాలను సర్వాపూర్ పంచాయతీ కార్యదర్శి అజ్మాత్ బుధవారం ఇంటింటి సర్వే చేశారు. ఈ సందర్భంగా అజ్మాత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక ఆర్థిక రాజకీయ కులగణన సర్వేను ప్రతీ కుటుంబం విధిగా ఉపయోగించుకోవాలని అన్నారు. కారోబార్ వినోద్, గ్రామ పెద్దలు లింగమూర్తి, సాంబలక్ష్మణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



వాజేడు: సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఎస్ఎస్ తాడ్వాయి: మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం

ఎస్ఎస్‌తాడ్వాయి: ప్రధానమంత్రి నరేంద్రమోదీదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. మండల కేంద్రంలో మండల సభ్యత్వ ప్రముఖ్ డ్యాగల సలేందర్ అధ్యక్షతన బూత్ కమిటీ కార్యకర్తల శిక్షణ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బూత్ స్థాయిలో క్రియాశీలకంగా పని చేస్తున్న వారిని బూత్ కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు భర్తపురం నరేష్, శ్రీమంతుల రవీంద్రచారి, అసెంబ్లీ కన్వీనర్ జాడి వెంకట్, జిల్లా కార్యదర్శి మేడిశెట్టి ఓమ్రా, కొత్త సురేందర్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి జంగ హన్మంత రెడ్డి పాల్గొన్నారు.

క్రియాశీల సభ్యత్వాలు చేయించాలి

ఏటూరునాగారం: బీజేపీ క్రియాశీల సభ్యత్వాలను బూత్ లెవల్ నాయకులు చేయించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు బలరాం అన్నారు. మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు గాడిచెర్ల రాజశేఖర్ అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మూడోసారి మోదీ ప్రధానమంత్రి కావడమే లక్ష్యంగా పార్టీ నాయకులు సైనికుల్లా పనిచేయాలన్నారు. సభ్యత్వాల నమోదులో క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్త సురేందర్, జాడి వెంకట్, శ్రీమంతుల రవీంద్రచారి, బర్తపురం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత



ఫోన్ అందజేస్తున్న ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: మంగపేట గ్రామానికి చెందిన పత్తిపాక రాము రెండు నెలల క్రితం మంగపేట నుంచి ములుగుకి బస్సులో వస్తుండగా గోవిందరావుపేటలో ఫోన్ పోయింది. వెంటనే రాము పస్రా పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేయగా ఎస్సై కమలాకర్ స్పందించి సీఈఐఆర్ పోర్టల్ ఆపరేటర్ అశోక్ సహాయంతో ఫోన్‌ను రికవరీ చేసి బుధవారం బాధితుడికి అందజేశారు.

క్రీడా దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గోవిందరావుపేట: పస్రా జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1997–98 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు ప్రస్తుతం అదే పాఠశాలలో ఆరవ, ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థులకు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని రూ.25 వేల విలువ చేసే క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాలి



వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఏటూరునాగారం: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని ప్రిన్సిపాల్ రేణుక అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ సంప్రదాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రేణుక జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యాపకులు, విద్యార్థులు తెలంగాణ సంప్రదాయ దుస్తులైన చీర, పంచలతో హాజరై అలరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంప్రదాయ సంస్కృతులు మన జీవన విధానాన్ని తెలియజేస్తాయన్నారు. విద్యార్థులు అందరూ సంప్రదాయ విధానాన్ని అనుసరించాలని కోరారు. అనంతరం విద్యార్థులు స్వయంగా తయారుచేసి తీసుకొని వచ్చిన తెలంగాణ వంటకాలను ప్రదర్శించారు. అధ్యాపకులు నవీన్, వెంకటయ్య, జ్యోతి, ఫాతీమా, సంపత్, మున్ని, జీవవేణి, రమేష్, సుమలత పాల్గొన్నారు.

‘ఆదివాసీ ముసుగులో భూ కబ్జాలు’

ఏటూరునాగారం: ఏటూరునాగారం ఐటీడీఏలో కంటిజెన్స్ వర్కర్‌గా పనిచేస్తున్న బడే సులోచన (దేవుడమ్మ)విధులు నిర్వహించకుండా భూ పంచాయతీలకు, భూ కబ్జాలకు పాలుపడుతుందని బీజేపీ నాయకుడు గండెపల్లి సత్యం బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గిరిజనేతరలకు చెందిన భూములల్లో అక్రమ వసూలకు పాలు పడుతూ గుడిసెలు ఏర్పాటు చేస్తుందని, గుడిసెలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆమెపై ఐటీడీఏ పీఓ చర్యలు తీసుకోవాలని కోరారు. బడే సులోచన వల్ల గిరిజనులు, గిరిజనేతరులకు గొడవలు అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ విషయంపై విచారణ చేపట్టాలని కోరారు.

పాఠశాల సమస్యలు పరిష్కరిస్తాం..

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న అన్నారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం పాఠశాలను ఆయన నాయకులతో కలిసి సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, వాష్ రూమ్స్, వంట గదులు బిల్లులు రాక కాంట్రాక్టర్ పనిని సగంలో వది లేసి పోవడం వల్ల ఇబ్బంది గా ఉందని ఉపాధ్యాయులు వివరించారు. కాంట్రాక్టర్‌తో ఫోన్‌ల్లో మాట్లాడి అధికారులతో మంత్రి సీతక్కతో ఫోన్‌ల్లో మాట్లాడించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, ఆయూబ్, బాలరాజు, నర్సింగరావు, నవీన్, రమేష్, మహేష్ పాల్గొన్నారు.



హెచ్‌ఎంతో మాట్లాడుతున్న ఇర్సవడ్ల వెంకన్న

విద్యార్థినికి అభినందన

కాటారం: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన కథల పోటీల్లో మండలంలోని ఒడిపిలవంచ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని పున్నం కీర్తన ప్రశంస బహుమతికి ఎంపికైంది. కీర్తన రాసిన అక్కా చెల్లెళ్లు అనే కథ ప్రత్యేక ప్రశంస బహుమతి కేటగిరిలో నిలిచింది. ఈ నెల 15న తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో కీర్తనకు బహుమతి అందజేయనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంగ లక్ష్మయ్య తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థిని కీర్తనతో పాటు ఇందుకు ప్రోత్సహించిన పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు సురేశ్‌ను బుధవారం హెచ్ఎం, పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్, తోకల లక్ష్మయ్య, సతీశ్, కృష్ణవేణి, డాక్టర్ మధు, పుష్పలీల అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గోవిందరావుపేట: మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు కార్యకర్తలకు అండగా ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేశ్, పూర్ణచందర్, బూరెడ్డి మధు, సాంబయ్య, స్వరూప, శ్రీనివాసరావు, చందులాల్, ప్రసాద్, మోహన్ రాథోడ్, రమేష్, సంజీవ, హరిబాబు, కనకయ్య, ఓదేలు, కృష్ణారెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న నాయకులు

‘గాలికుంటు’ నివారణ టీకాలు వేయించాలి

టేకుమట్ల: గాలికుంటు వ్యాధి నుంచి పశుసంపదను సంరక్షించుకోవాలని మండల పశు ఆరోగ్య ఉపకేంద్రం పశుసంపద సహాయకులు దాసరి శంకర్ రైతులను కోరారు. ఈ సందర్భంగా మండలంలోని ఆరెపల్లి గ్రామంలో గాలికుంటు నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు దఫాల గా లికుంటు నివారణ టీకాల కార్యక్రమం ఏర్పాటు చేస్తుందన్నారు. పశుమిత్ర వనిత, రైతులు ఉన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న శంకర్

నిరుపయోగంగా అంబేడ్కర్ భవనం

ములుగు రూరల్: మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ శాఖ కమ్యూనిటీ భవనం (అంబేడ్కర్ భవనం)ను బుధవారం కేవీపీఎస్ మండల కమిటీ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ మండల కార్యదర్శి జన్ను దేవేందర్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ భవనం నిరుపయోగంగా మారిందని భవన ఆవరణలో పిచ్చి చెట్లు, చెత్త పెరిగిందన్నారు. అధికారులు పట్టించుకోకపోవడం వల్ల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారుతుందని వాపోయారు. మండల కేంద్రంలో ప్రజా సంఘాలు ప్రజా సమస్యలపైన సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలంటే ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. అన్ని ప్రజా సంఘాలకు ఉపయోగపడే భవనం నేడు నిరుపయోగాంగ ఉండడం చాలా దురదృష్టకరమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేణిగుంట్ల శేకర్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానంపై అవగాహన అవసరం



పరీక్ష పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్ఎస్‌తాడ్వాయి: విద్యార్థులకు విజ్ఞానంపై అవగాహన అవసరమని ఇన్‌చార్జ్ హెచ్ఎం సక్రు నాయక్ అన్నారు. మండలంలోని కాటాపూర్ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక కార్యక్రమంలో భాగంగా చెకుముకి ప్రతిభా పరీక్షను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుక్రు నాయక్ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మండల స్థాయి జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో పోటీపడాలన్నారు. పరీక్షలో ఎస్‌కే నిజాముద్దీన్, ఎండీ హర్షిణి, రామ్ చరణ్, ఎండీ సమరీన్ ఎస్‌కె నిస్రుద్దీన్ ప్రతిభ కబర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అక్బర్ పాషా, జీవన్ లాల్, శ్రీదేవి రాజేష్, వెంకటేశ్వర్లు, శ్యాంసన్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో భగవాన్ బీర్సముండా జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గిరిజన సంక్షేమశాఖ అధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ఆశ్రమ పాఠశాలలోని విద్మార్థులు తాడ్వాయి ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు భగవాన్ బీర్సముండా జయంతి సందర్భంగా జనజాతి గౌరవ దివస్‌గా స్మరించుకుంటూ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థినులకు సంస్కృతిక, మనోవికాసానికి, చిత్రలేఖనం, వ్యాస రచన, ఉపన్యాసంతో పాటు పలు పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏటీడీఓ క్షేత్రయ్య హాజరై మాట్లాడుతూ.. గిరిజన ప్రజల స్వాతంత్ర్యం కోసం పాటుపడిన వ్యక్తి బిర్సా ముండా అని గిరిజన సమాజం జీవనశైలిని ఉద్ధరించిన వ్యక్తిగా అభివర్ణించారు. ఈకార్యక్రమంలో జీసీడీఓ సుగుణ, పాఠశాల పీజీ హెచ్ఎం రేవతి, ఉపాధ్యాయులు సతీష్ గంగు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు నిలిపి వేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

వాజేడు: మండల పరిధిలోని అయ్యవారిపేట, రాంపురం, భీమవరం ఇసుక ర్యాంపుల్లో తవ్వకాలను నిలిపేయాలని కోరుతూ బుధవారం బీఆర్ఎస్ నాయకులు, రైతులు ధర్నా నిర్వహించారు. ఇసుక లారీలు వస్తున్న రహదారికి అడ్డంగా రహదారిపై బైటాయించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెనుమల్ల రామ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గిరిజన సొసైటీల నుంచి రేజింగ్ కాంట్రాక్టర్లు ఇసుక క్వారీలను తీసుకుని ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నట్లు ఆరోపించారు. క్వారీల్లో టీఎస్ఎండీసీ అధికారులు లేకుండానే రాత్రి సమయాల్లో ఇసుకను లోడింగ్ చేసి తరలిస్తున్నట్లు తెలిపారు. డీడీ కంటే ఎక్కువగా లోడింగ్ చేయడం, జీరో బండ్లు పంపడం లాంటి అక్రమ లావాదేవీలు జరుగుతున్నట్లు ఆరోపణ చేశారు. ఇసుక లారీలు వచ్చే రహదారి వెంట దాదాపు 300లకు పైగా ఎకరాల్లో మిర్చి సాగు వేశారని లారీలు తిరుగుతుంటే ధుమ్ము, ధూళీ, మట్టి మొక్కలపై పడటంతో తెగుళ్ల వస్తున్నట్లు తెలిపారు. ఎకరానికి సుమారుగా రూ.3 లక్షల వరకు ఖర్చు చేసిన తోటకు తెగుళ్ల వచ్చి నష్ట పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఇసుక తొవ్వకాలను ప్రస్తుతం నిలిపేసి తిరిగి ఏప్రిల్ నుంచి కొనసాగించుకునేలా చుడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొల్లె కృష్ణార్జునరావు, అల్లి సూరి బాబు, కుదురుపాక రాములు తదితరులు ఉన్నారు.

ఏపీఏఆర్ ఐడీ జనరేట్ చేయాలి

ఏటూరునాగారం: ప్రతీ విద్యార్థికి ఏపీఏఆర్ ఐడీలను జనరేట్ చేయాలని సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ అర్షం రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓ కొయ్యడ మల్లయ్య అధ్యక్షతన ఏపీఏఆర్ ఐడీ, యూడైస్, ఆధార్ నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. యూడైస్‌లో నమోదైన ప్రతీ విద్యార్థికి కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తున్న ఏపీఏఆర్ ఐడీ తప్పనిసరిగా జారీ చేయించాలన్నారు. దీని కోసం విద్యార్థి వివరాలు చెక్ చేసుకొని అన్ని వివరాలు సరిగా ఉన్నాయా లేదా నిర్ధారించుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అనుమతి పత్రం తీసుకొని పిల్లలకు ఆపార్ ఐడీ జనరేట్ చేయాలన్నారు. ఎఫ్ఆర్ఎస్‌లో ప్రతీ రోజు విద్యార్థుల హాజరు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. డిసెంబర్ 4న జరగబోయే ఎన్ఏఎస్ పరీక్షలో జిల్లా ముందంజలో ఉండాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సాంబశివరావు, ఆశ్రమ పాఠశాల బాలికల హెచ్ఎం సంతోష్‌కుమార్, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అర్షం రాజు

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ములుగు రూరల్: బియ్యం అందజేస్తున్న రవిచందర్



మంగపేట: నగదు అందజేస్తున్న తాటి కృష్ణ

ములుగు రూరల్: మండల కేంద్రానికి చెందిన అరిగెల ఎల్లమ్మ, మండలంలోని జంగాలపల్లికి చెందిన కర్నె రాము, రాయిశెట్టి భిక్షపతి ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలకు గ్రంథాలయ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ బుధవారం పరామర్శించి బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి చాంద్ పాషా, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల భరత్ కుమార్, జగన్నాథం, బొమ్మకంటి రమేష్, రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

మంగపేట: మండలంలోని తిమ్మంపేటకు చెందిన మోడెం అశోక్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు తాటి కృష్ణ బుధవారం పరామర్శించి రూ.5,000 నగదు ఆర్థిక సాయంగా అందజేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు అర్జున్, నరేందర్, శ్రీనివాసచారి, కోరెం నారాయణ, అమిలి చంద్రం, తాటి సపుసీల్, హరిబాబు, సోషల్ మీడియ ఇన్‌చార్జ్ పూజారి సతీష్, వెంకన్న, రతన్‌సింగ్, రాంబాబు, సమ్మయ్య, నాగేష్, వెంకటనారాయణ ఉన్నారు.

క్లుప్తంగా

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



వాజేడు: మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మధుకర్ ఆధ్వర్యంలో బుధవారం క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ముందస్తుగానే గుర్తించిన అనుమానితులను ఆశ కార్యకర్తలు పరీక్షల కోసం తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు వెంకటరమణ, కోటిరెడ్డి, వెంకటేశ్వరరావు ఎల్‌టీ రజనీ కాంత్, పద్మ, లక్ష్మి, రమణ, జానకి ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



మంగపేట: మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రవీందర్‌ను మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్ బీఆర్ఎస్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. తహసీల్దార్‌ను సన్మానించిన వారిలో ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ సీనియర్ జిల్లా నాయకుడు చిట్టిమళ్ల సమ్మయ్య ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

మంగపేట: మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కొలిపాక వెంకటస్వామి బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఫిబ్రవరిలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు తనకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు.

‘అభివృద్ధి చూసి ఓర్వలేక ఆరోపణలు’

ఎస్ఎస్‌తాడ్వాయి: అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మంత్రి సీతక్కపై మాజీ జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి ఆరోపణలు చేస్తుందని తాడ్వాయి మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్‌దొర అన్నారు. బుధవారం అయన విలేకర్లతో మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో వర్షాల వరదలకు కొట్టుకపోయిన బ్రిడ్జిలను, రోడ్లను ఎందుకు పునర్‌నిర్మాణం చేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వేలాది ఉద్యోగ, ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసిందన్నారు. మంత్రి సీతక్క జిల్లాలో వేల కోట్ల రూపాయాలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. త్వరలో కొండాయి వాగుపై బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందన్నారు. రాజకీయ లబ్ధి కోసం మంత్రి సీతక్కపై నాగజ్యోతి తప్పుడు విమర్శలు చేయడాన్ని మానుకోవాలన్నారు.

పరామర్శ



చిట్యాల: మండల కేంద్రానికి చెందిన కొడెల నర్సయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్ నాగపూరి రాజమౌళి బుధవారం పరా మర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్‌గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తీగల జగ్గయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వరికోల్‌పల్లిలో..

మండలంలోని వరికోల్‌పల్లికి చెందిన కొమురమ్మ అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి పరామర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. గ్రామశాఖ అధ్యక్షుడు తానేష్, మూదత్తు రమేష్, ఎండీ.సిరాజ్, రంజాన్, అందుగుల రాజుతో పాటు తదితరులు ఉన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెంలో రొయ్యూరు గ్రామానికి చెందిన కావిరి డాలయ్య(45) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రొయ్యూరు గ్రామానికి చెందిన కావిరి డాలయ్య సమీప బంధువు మృతి చెందితే వారం క్రితం బుట్టాయిగూడేనికి వెళ్లాడు. అక్కడే జనగం ఎల్లయ్య అనే అనాథ వృద్ధుడి ఇంటి వద్ద ఉంటున్నాడు. కాగా, మంగళవారం గుడిసెలో దూలానికి తాడుతో ఉరివేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య మల్లక్క ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి కుమారుడు ఉన్నారు.